# తెర వెనుక

చాలా రోజులకు వచ్చిన విద్యను రజని ఆనందంగా ఆహ్వానించింది. సంవత్సరం కిందట రజనికి పెళ్లైంది. కానీ విద్యకు ఆ పెళ్ళి సమయానికి ఏదో ఇంటర్వ్యూ వచ్చి వెళ్ళలేకపోయింది గ్రీటింగ్స్ మాత్రం పంపించింది.

విద్యకింకా పెళ్ళికాలేదు.

అదే ఊరైనా ఇప్పటికి తీరిందామెకు రజనిని చూడటానికి.

"ఏమ్మా, గుర్తున్నామా అసలు?" నిష్ఠూరాలు సాగినాయి ఇద్దరి మధ్య.

"నేను అనాల్సిన మాట నువ్వన్నావు. శ్రీవారిసన్నిధిలో, కలల సౌఖ్యంలో ఉన్న నీకు నారాక పానకంలో పుడక అవుతుందేమో అని" అంటూ నవ్వేసింది విద్య.

"భలేదానివే-ఎన్నాళ్ళు కొత్త? అప్పుడే మా పెళ్లై మొన్న శ్రావణానికి సంవత్సరం దాటింది. నీకు తీరిక లేదని చెప్పక ఈ డొంక తిరుగుడు దేనికి?" అంది ఎదురు దెబ్బ తీస్తూ రజని.

"అఁ-నువ్వట్లాగే అంటావు. నీకు మాటలు బాగా వచ్చని నాకు తెలుసులే. ఇంట్లో ఎవరెవరుంటారు? నీ దినచర్య ఏమిటి?" అంది విద్య ఇల్లంతా పరిశీలనగా చూస్తూ.

"మా అత్తగారు, మామగారు, మరిది, మేమిద్దరం....దినచర్య అంటావా? ఇంటిపని, వంటపని-అంతే! కాలక్షేపం- ప్రైవేటుగా ఎమ్.ఏ. చదవమని అతి మంచి బాలుడైన మా శ్రీవారు ప్రోత్సహిస్తున్నారు. మా అత్తగారు చాలా మంచిది. మామగారు దేవుడు. మరిది ఉత్తముడు."

"అమ్మయ్య! అయిపోయిందా స్తోత్రం?"

"ఉన్నమాటే చెప్పానే! అతిశయోక్తులులేవు. జీవితం హాయిగా సాగిపోతోంది."

"అయితే, పెళ్ళి అనే లాటరీలో విజయం సాధించావన్నమాట! కంగ్రాచ్యులేషన్స్! అవునూ, అన్నట్లు నిన్ను చూడగానే నే నడగా లనుకున్న ముఖ్యమైన ప్రశ్న ఒకటుందే" అంది విద్య.

"అడగవే- ఏమిటది?" అంది రజని.

"అదే- నీ పెళ్ళి కొత్త పద్ధతిలో జరిగింది కదా! అందుకన్నా నేను వచ్చి చూడాలని చాలా ప్రయత్నం చేశాను...." అంది విద్య.

"కొత్త పద్ధతేముందే? సాధురాజ్ సన్నిధిలో, అదే ఆయన చేశాడు. అంతేగా" అంది రజని.

"అవునే మంగళసూత్రాలు ఆయనే సృష్టించి ఇస్తాడట కదా! ఆ మ్యాజిక్ చూడాలని చాలా ఆశపడ్డాను..." అంది విద్య.

"అబ్బ! ఏం కంచుకంఠమే, తల్లీ! కాస్త నెమ్మదిగా మాట్లాడకూడదూ. మా అత్తగారూ వాళ్ళూ అసలే పరమభక్తులు—వాళ్ళు వింటే బాగుండదు...." అంది కంగారుగా చూస్తూ రజని.

"ఎందుకే? నేనేమన్నా తప్పుగా మాట్లాడానా? ఎందు కంత భయపడతావు ?" అంది విద్య.

"మా అత్తగారు 'సాధురాజ్'ని దైవంలా పూజిస్తుంది. మ్యాజిక్ అన్నావంటే ఆవిడ నీ మీద యుద్ధం ప్రకటిస్తుంది" రజని హెచ్చరికగా అంది.

"సర్లే- గట్టిగా మాట్లాడను గానీ, నీ మంగళసూత్రాలు గాల్లోంచి తెప్పించి ఇచ్చాట్టకదా 'సాధురాజ్' గారు ఏవీ చూద్దాం" అంది రజని మెళ్ళోని మంగళసూత్రాలు బయటకు తీస్తూ. 'సాధురాజ్ గారిచ్చిన మంగళసూత్రాలు చాలా బాగున్నాయి ..." అంది విద్య కళ్ళెగరేస్తూ ఆ బంగారాన్ని పరిశీలనగా చూస్తూ.

రజని మాట్లాడలేదు. అంత హఠాత్తుగా రజని మొహం ఎందుకు మారిపోయిందో అర్థం కాలేదు విద్యకు.

"ఒక్క నిమిషం ఉండు. నీ కో రహస్యం చెప్తాను" అంటూ లోపల గదిలోకి వెళ్ళింది రజని.

"ఇదిగో చూడు" అంటూ లోపలనుంచి తెచ్చిన వస్తువును గుప్పిడి తెరిచి చూపించింది.

అవి రెండు మంగళసూత్రం బిళ్ళలు. అయితే, గిల్టువి. వాటికి వేసిన బంగారు కోటింగ్ పోయి నల్లబడి వెల వెల పోతున్నాయి.

"ఏమిటే ఇవి? ఎందుకు తెచ్చావు?" ఆశ్చర్యంగా చూస్తూ అంది విద్య.

"ఇవేనే సాధురాజ్ గారు పెళ్ళిలో నాకు ప్రసాదించినవి" అంది రజని.

మరింత విభ్రాంతికి లోనైంది విద్య. "ఏమిటీ ఇంద్రజాలం" అంది తేరుకుంటూ.

"అవును మరి. మూణ్ణెల్లు తిరగకముందే ఈ దశకు వచ్చింది. మా అత్తగారూ వాళ్ళకి సాధురాజ్ గారంటే నమ్మకమూ, భక్తీ, వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయడం నాకిష్టంలేక నేను బంగారంతో ఇవిగో అలాంటివే, మంగళసూత్రాలు చేయించుకొని జాగ్రత్తగా ఇవి తీసి పెట్టెలో దాచి పెట్టేశాను."

"అంటే, ఈ పని మీ అత్తగారికి తెలియకుండా చేశావన్న మాట" అంది ఆలోచనగా.

"అవును, అదిగాక ఇంకో సంగతి కూడా జరిగిందే...."

"ఏమిటది?" అంది కుతూహలంగా విద్య. ఆమె కింధంతా అవ నమ్మకంగానూ, విస్మయంగానూ ఉంది.

"ఓ రోజు మా అత్తగారూ, మామగారూ రహస్యంగా మాట్లాడుకోవడం అనుకోకుండా విన్నాను. అదేమిటంటే, మావీధిలో ఉండే సుశీల అనే అమ్మాయి పెళ్ళికూడా ఆమధ్య సాధురాజ్‌గారి అధ్వరంలో జరిగింది. ఆమెకుకూడా నాకులాగే ఆయన మంగళ సూత్రాలు ప్రసాదించాడు. అయితే, అవికూడా ఇట్లాగే నల్లబడిపోయినాయట. ఆ అమ్మాయి అవి వాళ్ళ అత్తగారికి చూపించింది. సాధురాజ్ గారు మహిమాన్వితులు. ఇవి ఇట్లా అవడానికి కారణం సుశీలలో ఏదో లోపం ఉండటమే అని తీర్మానించి శాశ్వతంగా పుట్టింటికి పంపించేశారట. ఈ వార్తకి నేను అదిరిపోయాను. విశ్వాసం ఉండచ్చు కానీ, మూర్ఖత్వం ఉండకూడదు. అలాంటి వాళ్ళని మనం ఒప్పించలేంకూడా. నాదీ ఆ ఫరిస్థితే గనక ఆ నమ్మకాన్ని అట్లా ఉండనిస్తే మనకేం నష్టంలేదు కదా అని ఎవరికీ తెలియకుండా నాకుగా నేనీపని చేశాను. స్నేహితురాలివని నీకు మాత్రం చెప్తున్నాను." అంది వివరంగా చెప్తూ రజని.

అంతే ఇక విద్య ఏం మాట్లాడలేదు. ఆలోచిస్తూనే ఉంది.

"విద్యా! ఏమిటే అట్లా అయిపోయినావ్?" అంది.

"అఁహఁ-ఏం లేదు" అంది నిర్లిప్తంగా విద్య.

ఆమె మనసులో ఏముందో తెలుసు గనుక రజని మరి రెట్టించక లోపలికి వెళ్ళింది కాఫీ తీసుకు రావడానికి.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 16-10-85)